క్లుప్తంగా

పశువైద్యశాల సందర్శన



రిజిస్టర్లను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని పశువైద్యశాలను జిల్లా యానిమల్ డిసీస్ డయోగ్నోస్టిక్ లాబొరేటరీ(ఏడిడిఎల్)అసిస్టెంట్ డైరెక్టర్ పవన్‌కుమార్ మంగళవారం సందర్శించారు. కార్యాలయంలోని రిజిస్టర్లను పరిశీలించారు. పశువుల ఆరోగ్య భద్రతకు తీసుకుంటున్న చర్యలు, అందుబాటులో ఉన్న మందుల వివరాలను తెలుసుకున్నారు. వివిధ వ్యాధుల వ్యాప్తి, పశుపోషకుల్లో అవగాహన పెంచడంపై స్థానిక అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు చేపట్టే ఆయా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించి పశుపోషకుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి పాండెన్, వీఏ దేవిదాస్, సిబ్బంది ఘని తదితరులు ఉన్నారు.

2,576 పశువులకు టీకాలు



ఎద్దుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

రాయికోడ్(అందోల్): రెండు వారాల నుంచి మండలంలోని 19 గ్రామాల్లో 2,576 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ పాండెన్ తెలిపారు. మండలంలోని నాగ్వార్ గ్రామంలో మంగళవారం సిబ్బందితో కలిసి 94 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి, పోషకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ సిబ్బంది దేవిదాస్, మోయినుద్దీన్, పశుపోషకులు ఉన్నారు.

అన్ని వసతులు కల్పిస్తున్నాం



తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఉమశంకర్

కల్హేర్(నారాయణఖేడ్): హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కలిపిస్తోందని సిర్గాపూర్ తహసీల్దార్ ఉమశంకర్ పేర్కొన్నారు. మంగళవారం సిర్గాపూర్‌లో ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, రికార్డులు పరిశీలించారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచిందని చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

నారాయణఖేడ్: మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పటోళ్ల సంజీవరెడ్డి నివాసంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సుధారెడ్డి అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యనాయకులు దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, శివాజీపటేల్, వెంకట్‌రెడ్డి, మథిన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



ప్లేట్లను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

జహీరాబాద్ టౌన్: మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్లేట్లను పంపిణీ చేశారు. మండలంలోని ధనసరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తినడానికి ప్లేట్లు లేని విషయం ఉపాధ్యాయుల దృష్టికి వచ్చింది. టీచర్లు మల్లయ్యస్వామి, చంద్రశేఖర్, పరమేశ్వర్, మంజుల, దాల్‌సింగ్‌లు సొంత డబ్బులతో ప్లేట్లను కొనుగోలు చేసి పంపిణీ చేశారు. ఉపాధ్యాయుల ఔదార్యానికి హెచ్‌ఎం.రమేశ్ వారిని అభినందించారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించండి

అదనపు కలెక్టర్ మాధురి



పుల్‌కల్: వడ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పుల్‌కల్(అందోల్): తేమ 17 శాతంలోపు, దుమ్ము లేకుండా ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని అదనపు కలెక్టర్ మాధురి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పుల్‌కల్, ముదిమానిక్యం, కోడూరులోని ధాన్యం కేంద్రాలను, రైస్‌మిల్లులను తహసీల్దార్ కృష్ణతో కలిసి పరిశీలించారు. పౌరసరఫరాల శాఖ నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని త్వరగా రైస్ మిల్లులకు తరలించాలని కేంద్ర నిర్వాహకులకు చెప్పారు. వరికోతలు కోసే సమయంలోనే యంత్రాల ఆర్‌పీఎం ఎక్కువ పెంచి కోతలు కోయాలన్నారు. అనంతరం పత్తి మిల్లుకు వెళ్లి సీసీఐ కేంద్రాన్ని పరిశీలించారు. పత్తిలో తేమ శాతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మాసాన్‌పల్లి, దేవునిపల్లిలో మంగళవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ నాయకులు, అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పద్మ సంగమేశ్వర్, హుస్సేన్, చీనూరి అనిల్ పాల్గొన్నారు.

సకాలంలో కొనుగోళ్లు పూర్తి చేయండి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి అఖిలేష్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. సకాలంలో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలన్నారు. కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ఎంపీఓ, ఎంపీడీఓ, ఏఈఓ, పీఏసీఎస్ సీఈఓ లక్ష్మణ్, ఐకెపి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టకండి

ఆర్డీఓ అశోక చక్రవర్తి



ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

నారాయణఖేడ్: వరిధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్వాహకులు, రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దని ఆర్డీఓ అశోక చక్రవర్తి సూచించారు. మండలంలోని వెంకటాపూర్ చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయడంలేదని రైతులు తమ దృష్టికి తీసుకురావడంతో తహసీల్దార్ భాస్కర్, ఏఈఓ సురేష్‌తో కలిసి మంగళవారం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. తేమ శాతాన్ని పరీక్షించారు. రైస్ మిల్లర్ల సమస్య ఉందని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఆర్డీఓ దృష్టికి తెవడంతో ఫోన్‌లో మిలర్లతో మాట్లాడి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.

రూ.28.36 కోట్లతో చెరువుల సుందరీకరణ

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని సాకి చెరువు, తిమ్మక్క చెరువు, ముత్తంగి గ్రామ పరిధిలోని ఎన్నం చెరువులను రూ.28.36లతో పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ చెరువుల విభాగం ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయా చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రధాన చెరువు తిమ్మక్క చెరువును ఏపీఆర్ గ్రూప్ సౌజన్యంతో రూ. 3.46 కోట్లు, సాకి చెరువును ఇంకార్ గ్రూప్ సౌజన్యంతో రూ.8 కోట్లు, ముత్తంగి ఎన్నం చెరువును హెచ్ఎండీఏ ద్వారా రూ.6.90 లక్షలతో అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. సాకి చెరువు కట్టపైన జీహెచ్ఎంసీ చెరువుల విభాగం ద్వారా రూ.10 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. ప్రతి చెరువు కట్టపైన సెంట్రల్ లైటింగ్ సిస్టం, గ్రీనరీ, వాకింగ్‌ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు పార్క్, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అతిత్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, హెచ్ఎండీఏ చెరువుల విభాగం డీఈ రామారావు, జీహెచ్ఎంసీ చెరువుల విభాగం డీఈ నళిని, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ముత్తంగి మాజీ సర్పంచ్ ఉపేందర్ పాల్గొన్నారు.

కురుమలు బీసీబీగా నమోదు చేసుకోవాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో కురుమలు తమ కులం పేరును బీసీబీగా నమోదు చేసుకోవాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, గొర్రె కాపరుల సహకార సంఘం ఉమ్మడి జిల్లా మాజీ డైరెక్టర్ నగేష్ సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉన్ని, పత్తిగొల్లగా పిలిచే కూడా బీసీబీ కురుమకులానికి చెందినవారని పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో తప్పు చెప్పకుండా సరైన కులాన్ని చెప్పి సర్వే సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కురుమలందరు హాజరు కావాలి

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో కురుమ కులస్తులందరు తప్పనిసరిగా హాజరై బీసీ-బి కురుమగా రాయించుకోవాలని మండల కురుమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. కొందరు పేరు పక్కన యాదవ్ అని రాసుకోవడంతో కురుమ జనాభా సరైన సంఖ్య తెలియడం లేదన్నారు. బీసీ-బీలో ఉన్న కురుమ కులస్తులం బీసీ-డిలోకి వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్క కురుమ కులస్తులు కులగణనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి అడ్డుకుంటే సహించం



విలేకరులతో మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి

ఏఎంసీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి

జోగిపేట(అందోల్): అందోల్ నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను అడ్డుకోవాలని కుట్రలు చేస్తే సహించేది లేదని జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బి.శివరాజ్ హెచ్చరించారు.మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల మంత్రి దామోదర రాజనర్సింహ నియోజకవర్గంలోని 13 గ్రామాల రోడ్లు 34 కి.మీ పొడవునా అభివృద్ధి చేసేందుకు రూ.25 కోట్లు మంజూరు చేయించారని అన్నారు. నియోజకవర్గంలో మంజూరైన రోడ్లపై మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మంత్రిపై చేసిన ఆరోపణలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కుటుంబ సభ్యులతో పాలన నడిపిందెవరో ప్రజలకు తెలుసునని అందుకే బుద్ధి చెప్పారన్నారు. 2022లో మంజూరైన నిధులు, ప్రస్తుతం కేటాయించిన నిధుల వ్యత్యాసంపై మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు చేయడం అవివేకానికి నిదర్శనమన్నారు. రెండేళ్లకొకసారి 10 నుంచి 12 శాతం ఎస్ఎస్ఆర్ రేట్లు పెరుగుతాయన్న పరిజ్ఞానం లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్.సురేందర్‌గౌడ్, ఎ.చిట్టిబాబు, నాగరాజ్, దుర్గేష్, చందర్ నాయక్, మాజీ ఎంపీటీసీ డీజీ వెంకటేశ్, మాజీ వార్డు సభ్యులు పీ.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



ఎ.నాగరాజు

జోగిపేట(అందోల్): ఐఎన్‌టీయూసీ టీఎస్ ఈఈ 327 యూనియన్ సంగారెడ్డి జిల్లా ప్రాంతీయ నూతన కమిటీలో జోగిపేటకు చెందిన ఎ.నాగరాజును జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కంపెనీ కార్యదర్శి కె. భూపాల్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. జిల్లా కమిటీలో అవకాశం కల్పించిన యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. చాలా కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులతో కలిసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. జోగిపేటకు చెందిన ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తొమ్మిది మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించింది. ఈ సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమ వారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం వారిని కోర్టులో హాజరు పరచగా తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా, ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత



కరపత్రం ఆవిష్కరిస్తున్న పులిమామిడి రాజు

సదాశివపేట(సంగారెడ్డి): దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పులిమామిడి రాజు పేర్కొన్నారు. పట్టణంలోని మద్దికుంట చౌరస్తాలో నెలకొల్పిన శ్రీవైష్ణవిమాత, హనుమాన్ ద్వాదశ జ్యోతిర్లింగ దేవాలయం తృతీయ వార్షికోత్సవ ఆహ్వాన కరపత్రికను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. సమాజంలోని ప్రజలందరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలన్నారు. ఈ నెల 13 నుంచి 15 వరకు శ్రీ హరిచందన పూర్వమఠం నుంచి శ్రీవైష్ణవి హనుమాన్ ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయం వరకు 51 కలశములతో మహిళల శోభయాత్ర, గోపూజ, గజారోహణం, గణపతి పూజ, అగ్నిప్రతిష్ట, గణపతి హోమం, ఆవాహిత దేవతపూజ, మహారుద్రాభిషేకం, రుద్ర హోమం, పూర్ణాహుతి, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూల్‌సింగ్‌మహరాజ్, లక్ష్మన్, శివకుమార్, పీఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

పొగాకు వాడకంతో అనారోగ్య సమస్యలు



అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: పొగాకు వాడడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని జిల్లా నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రి , మార్కెట్ తదితర ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు రహిత యువత కోసం కేంద్ర ప్రభుత్వం టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0ను ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పొగాకు రహిత తరాన్ని రూపొందించడంలో యువత సహకారం ముఖ్యమన్నారు. పొగాకు వాడడం వల్ల కలిగే దుష్పరిణామాలు వివరించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా, కొల్చారం మండలం, సంగాయిపేటకు చెందిన సుధాకర్(23), పటాన్‌చెరులోని ఇస్నాపూర్‌లో స్థానికంగా ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం సీలింగ్ రాడ్డుకు శాలువాతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కడుపునొప్పి తాళలేక..

పటాన్‌చెరు టౌన్: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. మండలంలోని ఇంద్రేశం ఆర్కేనగర్‌కు చెందిన పులయ్య(49), ఆరునెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం కడుపునొప్పి రావడంతో భరించలేక వేపచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌జీటీయూ బలోపేతానికి కృషి

జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్

జహీరాబాద్ టౌన్: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం(ఎస్‌జీటీయూ) బలోపేతానికి మహిళా విభాగం కన్వీనర్లు కృషి చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ కోరారు. ఎస్‌జీటీల విద్యాపరమైన సమస్యల పరిష్కారానికి సంఘం పోరాటాలు చేస్తుందన్నారు. మహిళా విభాగం నాయకులు తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య, నాయకులు అమృత్, శివశేఖర్, దేవిసింగ్ రాథోడ్, పాండు, రాజేంద్రప్రసాద్, ఝరాసంగం ఎంఈఓ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల మహిళా కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జహీరాబాద్ మండల కన్వీనర్‌గా వినయ్ పాటిల్, జహీరాబాద్ టౌన్ కన్వీనర్‌గా జ్యోతి, మొగుడంపల్లికి సురేఖ, న్యాల్‌కల్‌కు అనిత, ఝరాసంగం మండల కన్వీనర్‌గా శ్రీకన్య ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

జహీరాబాద్: గుర్తు తెలియని వాహనం ఢీకొని మండలంలోని శేఖాపూర్ గ్రామానికి చెందిన ఆకాశ్‌వర్ధన్(14), విద్యార్థి మరణించాడు. మంగళవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు జహీరాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి ఆకాశ్‌వర్ధన్ మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం తండాకు వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా శేఖాపూర్ తండా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



హత్నూర: ఓదారుస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రం హత్నూర మాజీ వార్డు సభ్యుడు ఆసిఫ్ తండ్రి గుండెపోటుతో మంగళవారం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు మంత్రి దామోదర రాక

మునిపల్లి(అందోల్): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య ప్రమాణ స్వీకారానికి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ వస్తున్నట్లు మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మను కలిసి ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ నెల 6న ఉ.11 గంటలకు సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మెన్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్ పాల్గొన్నారు.

◆ నేడు ఖేడ్‌కు 'గరికపాటి'

నారాయణఖేడ్: మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికపాటి నరసింహారావు నేడు 6న నారాయణఖేడ్‌కు రానున్నారు. శ్రీలలితాదేవి వైభవం ట్రస్టు నిర్వాహకులు మలమంచి మోహన్ జ్యోషి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లోని దుర్గాభవానీ మాత ఆలయం సమీపంలో 'శ్రీ లలితాదేవి వైభవం' అనే అంశంపై దివ్య ప్రవచనం అందించనున్నారని తెలిపారు. అంతకు ముందు రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అనుగ్రహబాషణం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

◆ రికార్డుల పరిశీలన

మునిపల్లి(అందోల్): మండలంలోని బొడ్పట్‌పల్లి గ్రామంలోని మంగళవారం అంగన్‌వాడీ సెంటర్‌ను ఎంపీడీఓ హరినందన్‌రావు సందర్శించారు. పిల్లల హాజరు, మెనూను పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం ఆహారం అందజేస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో శానిటేషన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నజీ సుల్తాన్‌బేగం, అంగన్‌వాడీ కార్యకర్త, విద్యార్థులు ఉన్నారు.

◆ పీఆర్టీయూ అధ్యక్షుడిగా బాగయ్య

జహీరాబాద్ టౌన్: పీఆర్టీయూ జహీరాబాద్ రూరల్ అధ్యక్షుడిగా బాగయ్య నియమితులైయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభులు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆయన ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభు, జిల్లా గౌరవ అధ్యక్షుడు తులసీరాం రాథోడ్, నాయకులు సురేందర్, శ్రీనివాస్, వరాలు, రమేష్ బాణోత్, మల్లికార్జున్, శ్రీశైలం, అశోక్, ఆనంద్, అర్జున్ చవాన్ పాల్గొన్నారు.

◆ మార్కెట్ డైరెక్టర్‌కు సన్మానం

మునిపల్లి(అందోల్): రాయికోడ్ మార్కెట్ డైరెక్టర్‌గా ఎంపికైన మల్లికార్జునపల్లికి చెందిన మహేశ్ కురుమకు మండల కురుమ సంఘం సీనియర్ నాయకులు శంకరయ్య, మల్లేశం శాలువా కప్పి సన్మానించారు. మంగళవారం మండలంలోని బుదేరాలో కురుమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమంలో కురుమలు బీసీ బీలో నమోదు చేయించుకోవాలని సూచించారు. కురుమలు ఎంత మంది ఉన్నారనే పూర్తి సమాచారం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో మల్లేశం, శ్రీశైలం, శ్రీను, అంజన్న, హనుమంతు, బాబు, అశోక్, మహేశ్, బీరప్ప, బసంతి తదితరులు పాల్గొన్నారు.

◆ బస్తీ దర్శన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్‌లో పరిధిలోని శ్రీసాయినగర్‌కాలనీలో మంగళవారం బస్తీదర్శన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ పుష్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. కాలనీలోని పార్కులో పిచ్చి మొక్కలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కాలనీలోని రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ.. త్వరలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

◆ ఆటో కార్మికుల ఆందోళన

హత్నూర (సంగారెడ్డి): ప్రభుత్వ తమను ఆదుకోవాలని హత్నూర మండలం దౌల్తాబాద్ రాజీవ్ గాంధీ చౌరస్తాలో మంగళవారం ఆటో కార్మికులు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ప్రతి ఆటో కార్మికుడికి నెల రూ.12 వేల ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటోలు నడవక ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో ఆటో ఫైనాన్స్ చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మోటార్ ట్రాన్స్‌పోర్టు జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి మారుతిరాజు, వెంకటేష్ ,రాజు, సుల్తాన్, మొయినుద్దీన్ కార్మికులు ఉన్నారు.

◆ వివాహిత అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వివాహిత అదృశ్యమైన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిషాకు చెందిన బీనత మండల తన కుటుంబ సభ్యులతో కలసి గత ఏడాది తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌కు వలస వచ్చారు. ఉస్మాన్‌నగర్ పరిధిలోని రాజ్‌పుష్ప లేబర్‌క్యాంప్‌లో నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం తన భర్త కూలి పనులకు వెళ్లిన తరువాత బీనత మండల ఇంట్లో పిల్లలకు కూరగాయలు తెస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం చుట్టు పక్కల వెతికిన ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.